

## భక్తిశ్రద్ధలతో చండీహోమం

దుగ్గిరాల: కంఠంరాజుకొండూరులో వేంచేసి ఉన్న మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో బుధవారం అమావాస్య సందర్భంగా చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



## ఆంజనేయునికి విశేష పూజలు

మాచర్ల: గుంటూరు రోడ్డులోని సప్తగిరి కాలనీ విఘ్నేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ మూడో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం విశేష పూజలు జరిగాయి.



## అసంపూర్తిగా రోడ్డు పనులు

క్రోసూరు: అమరావతి – బెల్లంకొండ రోడ్డు పనుల విషయంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహిస్తున్నారు. రోడ్డు మొత్తం గోతులమయంగా మారిందని వాపోతున్నారు.

# తీరంలో అధికార భూతాలు

## పచ్చ నేతలకు ప్రభుత్వ, అసైన్డ్ భూముల్ని కట్టబెడుతున్న రెవెన్యూ అధికారులు

తీరంపై అధికార పార్టీ గద్దలు వాలాయి.. రూ.కోట్ల విలువైన భూముల్ని కొందరు అధికారుల సాయంతో తన్నుకుపోతున్నాయి. ప్రజా ఆస్తులను ఫలహారంలా మింగేస్తున్నాయి. ప్రజా సంక్షేమం పక్కనపెట్టి దొరికిన కాడికి దోచుకుని జేబులు నింపుకొనే పనిలో పచ్చ పార్టీ నేతలు ఉన్నారు. అధికారులూ రూ.కోట్లు సంపాదిస్తున్నారు.

- అవినీతిలో కూరుకుపోయిన రెవెన్యూ అధికారులు
- సముద్రతీర భూములూ కూటమి నేతలకు ధారాదత్తం
- 'పచ్చ' ముఠాతో కలిసి భూదందాలు
- శ్రుతి మించిన అక్రమాలతో ఇప్పటికే వేటపాలెం తహసీల్దారు సరెండర్
- అదే బాటలో బాపట్ల రెవెన్యూ అధికారులపైనా చర్యలు?
- వివాదంలో పాండురంగాపురం తీరం భూముల వ్యవహారం
- పచ్చ నేతలకు భూములు అప్పగించారని రెవెన్యూ శాఖపై ఆరోపణలు
- ప్రభుత్వ భూములకు డీకేటీ పట్టాలిచ్చిన వైనంపై విమర్శలు
- విచారణకు ఆదేశించిన జిల్లా కలెక్టర్
- లోతుగా విచారణ చేపడితే వెలుగులోకి మరిన్ని అక్రమాలు



పాండు రంగాపురం వద్ద పచ్చనేత ఆక్రమించిన భూములు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: కొన్నిచోట్ల నేతలు, అధికారులు కలిసి భూములను కబ్జా చేసి ఆక్రమిత భూములను రిసార్ట్‌ల నిర్మాణదారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మరికొందరు పచ్చనేతలు, అధికారులు ఆక్రమిత స్థలాల్లో స్వయంగా రిసార్ట్‌లు నిర్మిస్తున్నారు. ఇంకొందరు అధికారులు తమకు అనుకూలంగా ఉన్న మిత్రులను పిలిపించి రిసార్ట్‌ల వ్యాపారానికి తెరలేపినట్లు తెలుస్తోంది. వేటపాలెం, బాపట్ల, చిన గంజాం మండలాల పరిధిలో ఈ తరహా ఒప్పందాలతో ప్రభుత్వ, అసైన్డ్ భూములను అధికారులతో కలిసి పచ్చ నేతలు కొల్లగొట్టి రూ.కోట్ల మేరకు అక్రమార్జనకు తెరతీశారు. మొత్తంగా ఈ వ్యవహారం ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. కొందరు అధికారుల తీరుపై జిల్లా రెవెన్యూ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

### తక్కువ ధరకే కట్టబెడుతూ..

వేటపాలెం మండలం పరిధిలోని విజయలక్ష్మీపురం, ఓడరేవు, రామాపురం, కటారివారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం సముద్రం తీరంలో(బీచ్) ఉన్న ప్రభుత్వ, అటవీ, అసైన్డ్ భూములను కొందరు రెవెన్యూ అధికారులు, పచ్చనేతలు కలిసి రిసార్ట్స్ యజమానులకు కట్టబెట్టి రూ.కోట్లు దండుకుంటున్నారు. ఎకరం రూ.5 కోట్ల ధర పలుకుతున్న ఈ భూములను రూ. 2 కోట్ల నుంచి రూ.3 కోట్లకు రిసార్ట్స్ యజమానులకు విక్రయిస్తున్నారు. చీరాల నియోజకవర్గ పచ్చ నేతకు పదుల ఎకరాల అసైన్డ్ భూములను అప్పగించిన రెవెన్యూ అధికారి.. ఇక్కడి మాజీ ఎమ్మెల్యేకు వేటపాలెం, చినగంజాం మండలాల్లో ఏకంగా వందలాది ఎకరాల అసైన్డ్ భూములు కట్టబెట్టినట్లు సమాచారం. పచ్చ నేత ఆ ఆక్రమిత భూముల్లో రియల్ ఎస్టేట్ చేస్తుండగా, మాజీ ఎమ్మెల్యే ఆక్రమిత భూముల్లో దర్జాగా రొయ్యల చెరువులు సాగు చేస్తున్నారు.

### ఉన్నతాధికారులకు అవినీతి చిట్టా

రెవెన్యూ అధికారి అవినీతి శ్రుతి మించడంతో ఏసీబీ పట్టుకుంది. రెవెన్యూ ఉన్నతాధికారుల సమాచారం మేరకు జిల్లా కలెక్టర్ వెంకట మురళి వేటపాలెం అధికారిని సరెండర్ చేశారు. జిల్లా కలెక్టర్ చర్యలపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. ఆ అధికారి అవినీతి చిట్టాతో కలెక్టర్ ఒక పెద్ద గ్రంథాన్నే సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పక్కా వివరాలతో నివేదించినట్లు సమాచారం. ఇక్కడే పనిచేస్తూ భూ కబ్జాల్లో సిద్ధహస్తుడైన మరో రెవెన్యూ అధికారిని బదిలీ చేశారు. ఈ వ్యవహారంపై చర్చ కొనసాగుతూ ఉండగానే జిల్లా కేంద్రమైన బాపట్ల రెవెన్యూ అధికారుల వ్యవహారం తెరపైకిచ్చింది. మరికొంతమందిపై కఠిన చర్యలు తీసుకుంటేనే ఇలాంటి అక్రమాలను అడ్డుకోవచ్చని ప్రజలు భావిస్తున్నారు.

### తీరాన్ని ఆక్రమించి మరీ...

చీరాలకు చెందిన పచ్చ నేత బుర్లా వెంకట్రావు, ఆయనతో కలిసి వ్యాపారం చేస్తున్న గుంటూరుకు చెందిన భ్రమర ఇన్‌ఫ్రా సంయుక్తంగా బాపట్ల మండలం పాండురంగాపురం వద్ద ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ సీ మౌత్‌తోపాటు అలల వరకూ సముద్రాన్ని ఆక్రమించారు. కొంత భాగానికి ఏకంగా డీకేటీ పట్టాలు పొందారు. ఈ ప్రాంతంలోని 9 గ్రామాల మత్స్యకారులు వ్యవహారాన్ని బయటపెట్టారు. అంతటితో ఊరుకోక ఆందోళనకు దిగారు. అధికారులు తాము పట్టాలివ్వలేదని బుకాయిస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు మాత్రం ఆ డీకేటీ పట్టాలు కొత్తగా ఇచ్చినవని చెబుతున్నారు. మరోవైపు చుట్టుపక్కల వందలాది ఎకరాల అసైన్డ్ భూములకు సైతం రెవెన్యూ అధికారులు రూ.కోట్లు దండుకొని డీకేటీ పట్టాలిచ్చినట్లు ప్రచారం సాగుతోంది.



పొట్టిసుబ్బయ్యపాలెం ప్రాంతంలో ఆక్రమణలోని అసైన్డ్ భూములు

### అటకెక్కిన కమిటీ..

ఈ భూకబ్జాల వ్యవహారం తేల్చేందుకు జిల్లా కలెక్టర్ వెంకట మురళి విచారణ కమిటీని నియమించారు. నెల లోపు విచారణ పూర్తి చేస్తామన్నారు. అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఒక్క పాండు రంగాపురం భూ కబ్జాల వ్యవహారంలోనేకాక వేటపాలెం, చినగంజాం మండలాల పరిధిలోని ప్రభుత్వ, అసైన్డ్ భూముల కబ్జాలపైనా విచారణ నిర్వహించాలని ప్రజా సంఘాలతోపాటు పలు మత్స్యకార సంఘాలు కూడా డిమాండ్ చేస్తున్నాయి. అన్యాక్రాంతమైన వాటిని కాపాడాలని కోరుతున్నాయి. ఆక్రమణల వ్యవహారంపై ఎప్పటికప్పుడు దృష్టి నిలిపి వేటపాలెం రెవెన్యూ అధికారి తరహాలో అక్రమాలకు తెగబడిన మిగిలిన అధికారులపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి వేటు వేస్తే మిగిలిన వారు అక్రమాలకు దూరంగా ఉండే అవకాశముంది.



రామాపురం వద్ద తీరం వరకూ రిసార్ట్స్ యాజమాన్యం ఆక్రమించిన భూములు

## న్యూస్‌రీల్

### బడులను సందర్శించిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్



విజయపురి సౌత్: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర్‌రావు బుధవారం మాచర్ల మండలం ఎత్తిపోతల (7 మైలు) గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఇంటర్మీడియట్ వరకు బడిని అప్‌గ్రేడ్ చేయించాలని గిరిజన నాయకులు, ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవాని కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చైర్మన్ హామీ ఇచ్చారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి, అభినందించారు. తర్వాత బ్రహ్మానందపురం తండాను సందర్శించి గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. విజయపురి సౌత్‌లోని పీటీజీ పాఠశాల విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. ఎస్టీ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ సాంబయ్య, డీటీడబ్ల్యూ జ్యోత్స్న, తహసీల్దార్ కిరణ్ కుమార్, పీటీజీ పాఠశాల ప్రిన్సిపల్ మురళీ శ్రీనివాస్, గిరిజన సలహా మండలి సభ్యులు రావుల కొండలు, జెడ్పీటీసీ మల్లు స్వామి, మాజీ సర్పంచ్ కరంటోత్ పాండు నాయక్, నాగేశ్వరరావు నాయక్, బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, బాలాజీ నాయక్, బామల నాయక్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

### పల్నాడు జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్లు బదిలీ

నరసరావుపేట: జిల్లాలో పలువురు డిప్యూటీ తహసీల్దార్లు (డీటీ)లను బదిలీ చేస్తూ పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు టి.కొండారెడ్డిని నకరికల్లుకు, అరుణదేవిని బెల్లంకొండకు, షేక్ సాల్మన్‌ను నాదెండ్లకు, ఎస్.శ్యామలతను పెదకూరపాడుకు, కె.శ్రీనివాస రావును నరసరావు పేటకు, బి.సుబ్బారావును శావల్యాపురానికి, పి.తులసీ రామ్‌ను నూజెండ్లకు, జి.వెంకట రమణను రెంటచింతలకు, పి.బ్రహ్మయ్యను దాచేపల్లికి, కె.రాజశేఖర్ నాయక్‌ను వెల్దుర్తికి, పి.వెంకటరెడ్డిని రొంపిచర్లకు, కె.బాల వెంకటేష్‌ను ముప్పాళ్లకు, ఎన్.అనూరాధను యడ్లపాడుకు, షేక్ బాషాను మాచర్లకు, ఎం.రాజాను అమరావతికి, సీహెచ్ లక్ష్మీప్రసాద్‌ను సత్తెనపల్లికి, పి.నరసయ్యను బొల్లాపల్లికి, ఐ.ఫణీంద్రను గురజాల ఆర్డీవో కార్యాలయానికి, జి.విద్యాసాగర్‌ను కారంపూడికి బదిలీ చేశారు.

### సాయిబాబాకు ప్రత్యేక పూజలు



వినుకొండ: పట్టణంలోని షిరిడీ సాయిబాబా దేవస్థానంలో 34వ గురుపౌర్ణమి ఉత్సవాల సందర్భంగా బుధవారం భారీ గణపతి రూపం ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# జిల్లా కోర్టు భవన సముదాయానికి భూమి కేటాయింపు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: జిల్లా కోర్టు భవన సముదాయానికి అవసరమైన 2.80 ఎకరాల భూమి సిద్ధంగా ఉంచామని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. రాజధాని అమరావతి నుంచి సీసీఎల్‌ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీక్షణ సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రమైన బాపట్లలో జిల్లా కోర్టు భవన సముదాయానికి కావలసిన భూమి సిద్ధంగా ఉంచినట్లు ఆమె దృష్టికి కలెక్టర్ తీసుకువెళ్లారు. పీజీఆర్ఎస్ అర్జీలపై ఆడిట్ నిర్వహించాలని జయలక్ష్మి అన్నారు. జాతీయ రహదారులకు భూ సేకరణ వేగంగా పూర్తి చేయాలన్నారు. జిల్లా నుంచి జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, ఆర్‌డీఓపీ గ్లోరియా, ఉప కలెక్టర్ లవన్న, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కనకరాజు, వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల: నాటు సారా రహిత జిల్లాగా బాపట్ల నిలిచిందని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. నవోదయం 2.0 నాటు సారా నిర్మూలన కమిటీ జిల్లా స్థాయి సమావేశం బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా రూపొందించిన గోడపత్రాలను కలెక్టర్ విడుదల చేశారు. నాటు సారా ఉత్పత్తిని జిల్లాలో పూర్తిగా అరికట్టామని చెప్పారు. గడిచిన రెండు నెలల్లో విస్తృతంగా దాడులు నిర్వహించి 5,240 లీటర్ల నాటు సారా ధ్వంసం చేశామన్నారు. 17 గ్రామాలలో 42 కేసులు నమోదు చేశామని తెలిపారు. 34 మందికి పునరావాస కల్పనకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. 64 మందిని బైండోవర్ చేశామన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేశారని ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ సహాయ కమిషనర్ హేమంత్ నాగరాజు తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, కమిటీలోని అధికారులు పాల్గొన్నారు.

### జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ లక్ష్యాలు సాధించాలి

బాపట్ల: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ 2025 – 26 ఆర్థిక సంవత్సరం వార్షిక ప్రణాళిక లక్ష్యాల సాధన మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని వీక్షణ సమావేశ మందిరంలో సంస్థ వార్షిక ప్రణాళికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటికొక స్థిరమైన జీవనోపాధి లేదా పారిశ్రామికవేత్తను తయారు చేసేలా ప్రణాళిక తయారు చేశామన్నారు. పీ4 కింద జిల్లాలో 62,368 మంది బంగారు కుటుంబాలను ఎంపిక చేశామని తెలిపారు. మార్గదర్శకులుగా 3,524 మంది ముందుకు వచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పి.డి. శ్రీనివాసరావు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ అంజనేయులు, డీపీఓ ప్రభాకర్, ముఖ్య ప్రణాళిక అధికారి షాలేం రాజు, బాపట్ల డీఎల్‌డీఓ విజయలక్ష్మి, చీరాల డీఎల్‌డీఓ పద్మావతి, రేపల్లె డీఎల్‌డీఓ పద్మ, మున్సిపల్ కమిషనర్లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### బాపట్ల ఎమ్మెల్యే అండతోనే సముద్ర తీరం కబ్జా

చీరాల రూరల్: బాపట్ల ఎమ్మెల్యే అండతోనే బాపట్ల జిల్లా అడవిపాలెం పంచాయతీ పరిధిలోని పల్లెకారులు పడవలను నిలిపే ప్రాంతంలో అక్రమాలు జరుగుతున్నాయని దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మాచవరపు జూలియస్ ఆరోపించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సీ మౌత్ రిసార్ట్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారి వెంకట్రావు సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. భూ ఆక్రమణలు తొలగించాలని మత్స్యకారులు, ప్రజా సంఘాల వారు పోరాడుతున్నప్పటికీ బాపట్ల జిల్లా కలెక్టర్ స్పందించకపోవడం రాజకీయ నాయకుల మెప్పు కోసమేనని ధ్వజమెత్తారు. ప్రజా సంఘాల నాయకులు నిజనిర్ధారణ కమిటీగా ఏర్పడి సంఘటన స్థలానికి వెళ్లేందుకు సమాయత్తమైతే.. బాపట్ల డీఎస్పీ అడ్డుపడుతున్నారని చెప్పారు. చూస్తుంటే ఇదంతా ఎమ్మెల్యే ఒత్తిడితోనే జరుగుతున్నట్లుగా ఉందని ఆరోపించారు.

# తిమ్మరాజుపాలెంలో రైతుల రాస్తారోకో

- జాతీయ రహదారి నిర్మాణంతో అవస్థలపై నిరసన
- వరద నీటి తూముల ఏర్పాటుకు డిమాండ్



రాస్తారోకో చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

పర్చూరు (చినగంజాం): వాడ రేవు నుంచి చిలకలూరిపేట వరకు చేపట్టిన 167ఏ జాతీయ రహదారి నిర్మాణ పనులతో అవస్థలు పడుతున్నామని తిమ్మరాజుపాలెం రైతులు బుధవారం రాస్తారోకో నిర్వహించారు. రోడ్డు నిర్మాణం వలన వరద ముంపు సమయాల్లో తమ పొలాలు మునిగి పంట నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద వరద నీరు పారేలా తూములు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోతో కిలోమీటరు మేర పదుల సంఖ్యలో రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించిన టిప్పర్లు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. హైవే అధికారులతో మాట్లాడి వెంటనే తూములు ఏర్పాటు చేయిస్తామని రైతులకు హామీ ఇవ్వడంతో వారు తాత్కాలికంగా రాస్తారోకో విరమించారు.



రోడ్డుపై నిలిచిపోయిన టిప్పర్లు






తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి హాజరైన బాపట్ల జిల్లా పార్టీ అధ్యక్షుడు మేరుగ నాగార్జున, బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త కోన రఘుపతి, రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త గణేష్ తదితరులు

# కాలువ పూడ్చి సీసీ రోడ్డు నిర్మాణానికి యత్నం

పెరవలిపాలెం(వేమూరు): కూటమి నాయకులు డ్రైనేజీ కాలువ పూడ్చి మరీ సిమెంట్ రోడ్డు వేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో రైతులు ఆ పనులు చేపట్టరాదని అడ్డుకున్నారు. వేమూరు మండలంలోని పెరవలి పాలెం గ్రామంలో కూటమి నాయకులు పొలాల మురుగు నీరు వెళ్లే కాలువ పూడ్చి సిమెంట్ రోడ్డు వేసేందుకు సిద్ధం అయ్యారు. దీంతో గ్రామంలోని రైతులు వచ్చి రోడ్డు వేయరాదని అడ్డుకున్నారు. పంట పొలాలు మునిగి పోతాయని, రైతులకు నష్టం వాటిల్లుతుందన్నారు. దీంతో పనులు నిలిపి వేశారు. సిమెంట్ రోడ్డు కమీషన్ కోసం కాలువలు కూడా పూడ్చి వేయడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



పెరవలి పాలెం గ్రామంలో రోడ్డు పనులు అడ్డుకుంటున్న రైతులు

## కోడి పందేల నిర్వాహకులు అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని దుద్దుకూరు గ్రామ శివారులో కోడి పందేలు ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 3,300 నగదు, రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వివరాలను ఎస్‌ఐ జి. సురేష్ బుధవారం వెల్లడించారు.

## తాళం పగులగొట్టి నగదు, బంగారం చోరీ



దొంగలు పగులగొట్టిన బీరువా

సంతమాగులూరు (అద్దంకి): తాళం వేసిన ఇంటిలో బంగారం, నగదు చోరీకి గురైన సంఘటన కుందుర్రులో మంగళవారం సాయంత్రం జరగ్గా, బుధవారం వెలుగు చూసింది. పోలీసులు అందించిన సమాచారం మేరకు.. ఆలకుంట లింగయ్య భార్య గురవమ్మ ఈ నెల 24న తన ఇంటికి తాళం వేసి తాళం చెవిని ఇంటి గుమ్మంపైన పెట్టింది. తర్వాత పొలం పనులకు వెళ్లింది. తిరిగి సాయంత్రం ఆరు గంటలకు వచ్చి చూడగా, ఇంటి తాళం తీసి ఉంది. ఇంట్లోని బీరువాలో దాచిన రూ.20 వేలు, నాలుగు గ్రాముల బంగారు దుద్దులు చోరీకి గురయ్యాయి. బుధవారం క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పట్టాభి తెలిపారు.

## కౌలురైతులకు బ్యాంకుల ద్వారా పంట రుణాలు

పంట సాగుదారుల చట్టంపై కరపత్రాలు ఆవిష్కరించిన డీఆర్ఓ, జిల్లా వ్యవసాయాధికారి



నరసరావుపేట: ప్రతి కౌలురైతుకు పంటసాగుదారు కార్డులు జారీచేసి బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇప్పించాలనే లక్ష్యంతో ప్రతి రెవెన్యూ గ్రామంలో రైతుసేవా కేంద్రాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి ఏకా మురళి పేర్కొన్నారు. బుధవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) ఆధ్వర్యంలో పంట సాగుదారుల చట్టంపై రూపొందించిన కరపత్రాలను కలెక్టరేట్‌లో డీఆర్ఓ, వ్యవసాయ శాఖ కార్యాలయంలో జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళిలు ఆవిష్కరించారు. డీఆర్ఓ మురళి మాట్లాడుతూ ప్రతి కౌలురైతు ఈ సదస్సులో పాల్గొని గుర్తింపు కార్డులు తీసుకొని ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలను పొందాలని కోరారు. పంటసాగుదారు కార్డు దారులందరికీ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో క్రాప్‌లోన్లు మంజూరు చేయించడం, సాగుదారులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణాలు అందజేయడం జరుగుతుందని అన్నారు.

**రైతు ఆత్మహత్యల్లో మూడొంతులు కౌలు రైతులే..**

డీఏఓ ఐ.మురళి మాట్లాడుతూ రాష్ట్రంలో 32 లక్షల పైగా కౌలు రైతులు ఉన్నారనీ రాధాకృష్ణన్ రిపోర్టు ఆధారంగా తెలుస్తోందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రైతు ఆత్మహత్యల్లో మూడొంతులు కౌలు రైతులే ఉన్నారన్నారు. వీఆర్వో గుర్తించిన గుర్తింపు కార్డు ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఆర్థిక సంస్థలు, బ్యాంకుల నుంచి కౌలురైతులు రుణాలు పొందవచ్చన్నారు. డీబీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, ఏరియా కో-ఆర్డినేటర్స్ తోకల సాంబయ్య, గడ్డిపర్తి కోటిరత్నం పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలతో ఎన్నో అనర్థాలు



రేపల్లె: మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో ఎం.సుచిత్ర చెప్పారు. మండలంలోని బేతపూడి ప్రాథమిక పాఠశాలలో బుధవారం నిర్వహించిన నిషా ముక్త భారత్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు బానిసలైతే బంగారు భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. మత్తు పదార్థాలతో నష్టాలను తెలుసుకుని తల్లిదండ్రులకు, తోటి వారికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం సునీల్ భాస్కర్, సూపర్‌వైజర్ హిమబిందు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, కృష్ణారావు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## మిర్చి రైతులను గాలికొదిలిన చంద్రబాబు

పిడుగురాళ్ల: కూటమి ప్రభుత్వం చేసేది గోరంత చెప్పేది కొండంత అనే చందగా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ ప్రభుత్వం మిర్చి రైతుల సమస్యలపై అశ్రద్ధ వహిస్తుందన్నారు. మిర్చి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్వింటా సుమారు రూ.25,000 పలికిన మిర్చి ధర కూటమి ప్రభుత్వంలో రూ.6వేలకు పడిపోయిందన్నారు. ఫిబ్రవరిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు మిర్చి యార్డు పర్యటనతో బెంబేలెత్తిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లు కనీస మద్దతు ధర రూ.11,700 ఉండబోతుందంటూ ఆర్భాటపు ప్రకటన చేశారన్నారు.



# రోబోటిక్ సర్జరీల్లో భారత్ పురోభివృద్ధి


సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

గుంటూరు మెడికల్: మోకీలు, తుంటి మార్పిడి శస్త్రచికిత్సల్లో రోబోటిక్, కృత్రిమ మేధస్సు (ఏఐ) పురోగతిని రష్యన్లకు పరిచయం చేయడం ఆనందంగా ఉందని సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి పేర్కొన్నారు. రష్యా రాజధాని మాస్కోలో నాలుగు రోజులు పాటు జరిగిన యూరో ఆసియన్ ఆర్థోపెడిక్ ఫోరం ప్రదర్శనలో పాల్గొని వచ్చిన ఆయన బుధవారం స్థానిక అరండల్‌పేటలోని సాయి భాస్కర్ హాస్పిటల్స్‌లో అక్కడి అనుభవాలను విలేకరులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది జనవరిలో ప్రధాని నరేంద్ర మోదీ ఆర్థోపెడిక్ విభాగంలో వినియోగం పెంచాలని సూచిస్తూ పలు రోబోటిక్‌లను ప్రారంభించినట్లు తెలిపారు. దానికి అనుగుణంగా రష్యాలో జరిగిన ఈ ప్రదర్శనలో భారత్‌లో ఆర్థోపెడిక్ రంగంలో రోబోటిక్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వినియోగాన్ని, అనుసరిస్తున్న ఆధునిక సాంకేతిక పద్ధతులను రష్యన్ సర్జనులకు వివరించడం కొత్త అనుభూతిని మిగిల్చిందని పేర్కొన్నారు. జాయింట్ రీప్లేస్మెంట్‌లో రోబోటిక్ వాడకంపై రష్యన్ సర్జన్‌లు ప్రత్యేక ఆసక్తిని కనబరిచారని వివరించారు. రష్యాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నప్పటికీ సమావేశాలకు దాదాపుగా 500 మందికి పైగా ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు హాజరయ్యారని తెలిపారు. భారత్‌లో మోకీలు, తుంటి మార్పిడి శస్త్ర చికిత్సలలో రోబోటిక్ పాత్ర, అనుభవాలను అక్కడి వారికి వివరించినట్లు డాక్టర్ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.



రష్యన్‌లకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి

## మాస్టర్ మైండ్స్ విద్యార్థులకు పురస్కారాలు



పురస్కారం అందుకుంటున్న రిషబ్ ఓస్వాల్, కొత్తపేట తేజస్విని

గుంటూరు ఎడ్యుకేషన్: సీఎంఏ ఫైనల్ పరీక్ష ఫలితాల్లో అఖిల భారతస్థాయిలో ప్రథమ ర్యాంకులను సాధించిన మాస్టర్ మైండ్స్ విద్యార్థులు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నట్లు సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది డిసెంబర్‌లో జరిగిన సీఎంఏ ఫైనల్ పరీక్ష ఫలితాల్లో ప్రథమ ర్యాంకు సాధించిన ఆర్. రిషబ్ ఓస్వాల్, జూన్-2024లో జరిగిన సీఎంఏ ఫైనల్ పరీక్షల్లో ప్రథమ ర్యాంకు కైవసం చేసుకున్న కొత్తపేట తేజస్వినిని ఈనెల 23న న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి సత్కరించారని వివరించారు. వివిధ కామర్స్ కోర్సుల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు 55 సార్లు ఆలిండియా ఫస్ట్ ర్యాంకులు సాధించారని, అయితే గతేడాది జరిగిన సీఎంఏ ఫైనల్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకులను కైవసం చేసుకోవడం అరుదైన సంఘటనగా ఆయన పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించేందుకు కృషి చేసిన విద్యార్థులు, సహకరించిన తల్లిదండ్రులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి మోహన్ అభినందనలు తెలియజేశారు.

## న్యాయవాదుల విశిష్టతకు పుస్తక రూపం అభినందనీయం

తెనాలి: న్యాయవాదుల విశిష్టతను నేటి తరానికి తెలియజేయడం అభినందనీయమని పలువురు న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఇటీవల హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ఆవిష్కరించిన 'తెనాలి లాయర్స్ డైరీ-2025' పరిచయ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం తెనాలి కోర్టు ప్రాంగణంలోని మహిళా న్యాయవాదుల భవనంలో నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ అధ్యక్షత వహించారు. 11వ అదనపు జిల్లా జడ్జి డి.శ్రీనివాసులు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్‌కుమార్, ఫస్ట్ ఏఎంఎం వివేక్‌వర్ధన్‌లు పాల్గొన్నారు. తెనాలి లాయర్స్ డైరీతో ఈ ప్రాంత న్యాయవాదుల ప్రాముఖ్యతను, సమాచారాన్ని పొందుపరచడం ఉపయోగకరమని జడ్జి ఎం.శ్రీధర్ అన్నారు.